సాక్షి
ఖమ్మం
మంగళవారం ; 8 ; ఆగస్టు ; 2023



... కొలువు కొట్టారు !

జిల్లాకు చెందిన పలువురు యువతీయువకులు పట్టుదలతో శ్రమించి తాజాగా వెల్లడైన ఎస్సై ఎంపిక ఫలితాల్లో సత్తా చాటారు. 8లో



అర్థవంతంగా సమావేశాలు

జెడ్పీ సమావేశాలను అర్థవంతంగా నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ కమల్‌రాజ్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం 34° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

సత్వర విచారణ, పరిష్కారం



బాధితులతో మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: బాధితులు ఇచ్చే ఫిర్యాదులను సత్వరమే విచారించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం వినతిపత్రాలు, ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఇరవైకి పైగా ఫిర్యాదులు అందగా, విచారణపై అధికారులకు సీపీ సూచనలు చేశారు.

'ఇంద్రధనుష్'ను పరిశీలించిన వ్యాక్సినేషన్ మేనేజర్



బాలింతలతో మాట్లాడుతున్న మేనేజర్ రమణ

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి పీహెచ్‌సీ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ రమణ సోమవారం పరిశీలించారు. మండలంలోని తనికెళ్ల, అనంతారం, చిన్నగోపతి, పెద్దగోపతి గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రమేష్ నేతృత్వాన పిల్లలు, గర్భిణులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పరిశీలించిన మేనేజర్ మాట్లాడుతూ అర్హులైన గర్భిణులు, చిన్నారులకు నూరు శాతం టీకాలు వేయాలని సూచించారు. హెచ్ఈఓ నాగేశ్వరరావు, ఉద్యోగులు సుజాత, ఉమారాణి, సులోచన, సుభద్ర పాల్గొన్నారు.

మూడోరోజు 24 దరఖాస్తులు



అధికారికి దరఖాస్తు ఇస్తున్న వ్యాపారి

ఖమ్మంక్రైం: జిల్లాలోని 122 వైన్స్ కేటాయింపునకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈమేరకు మూడో రోజైన సోమవారం 24 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 32 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కాగా, దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉండగా వ్యాపారులు పలువురు సిండికేట్‌గా ఏర్పడుతున్నట్లు సమాచారం.

జిల్లా సంక్షేమాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సుమ

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా సంక్షేమాధికారి తాళ్లూరి సుమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఆమెకు గతనెల జూలై 31న డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈమేరకు ఆమెను జిల్లా సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ విభాగాలతో కూడిన అధికారిగా డిప్యూటేషన్‌పై నియమించారు. దీంతో సుమ విధుల్లో చేరగా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతరాణి, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

'గృహలక్ష్మి'కి 10లోగా దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్థికసాయం కోసం ఈనెల 10వ తేదీగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. సొంత స్థలం కలిగి ఇల్లు లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని వెల్లడించారు.

రేపటి నుంచి ఎస్డీఎల్‌సీఈ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య(ఎస్డీఎల్‌సీఈ) డిగ్రీ పరీక్షలు ఈనెల 9నుంచి నిర్వహిస్తున్నట్లు ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటలవరకు జరుగుతాయని పేర్కొన్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

అడవిలో మళ్లీ అలజడి!



ఎల్లన్ననగర్‌లో పోడు సాగుదారులు, అటవీ అధికారుల నడుమ ఘర్షణ (ఫైల్)

పోడు భూముల్లో అక్కడక్కడా ఉద్రిక్త పరిస్థితులు

- సాగు పనులను అడ్డుకుంటున్న అటవీ శాఖ
- కారేపల్లి, ఎల్లన్ననగర్‌ల్లో తాజాగా ఘర్షణలు
- జిల్లాలో తిరిగి మొదలైన పోడు రగడ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అడవిలో మళ్లీ అలజడి మొదలవుతోంది. వర్షాకాలం సీజన్ ప్రారంభంతోనే పోడు భూముల్లో అక్కడక్కడా ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. కారేపల్లి, కొణిజర్ల మండలాల్లో తాజాగా ఘర్షణ జరగగా... పోడు పట్టాల పంపిణీ జరిగినా పలుచోట్ల పోడు రగడ చల్లారలేదనడానికి నిదర్శనంగా కనిపిస్తోంది. భూముల్లో పోడుదారులు బోర్లు వేస్తుండటం, మరింత భూమిని సాగు చేసుకునేందుకు పలువురు సిద్ధమవుతుండడంతో అటవీ శాఖ తీవ్ర చర్యలకు ఉపక్రమించింది.

పట్టాలు పంపిణీ..

పోడు భూముల కోసం జరిగిన ఉద్యమాలతో అర్హులైన పోడుదారులకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2021 నవంబర్ 8 నుంచి దరఖాస్తులు స్వీకరించగా, జిల్లాలోని 10 మండలాలకు చెందిన 94 గ్రామపంచాయతీల్లో 132 ఆవాసాల పోడుదారుల నుంచి దరఖాస్తులు అందాయి. ఈమేరకు 43,193 ఎకరాలపై హక్కు కోసం 18,487 మంది దరఖాస్తు చేసుకోగా సర్వే అనంతరం 12,144 మందికి పట్టాలు అందజేశారు. ఇంకా మిగిలిన వారు పట్టాలు ఇవ్వాలని ఆందోళనలు చేస్తుండగా.. సర్వే ఆధారంగా ఇప్పటి వరకు అర్హులకు పోడు పట్టాలు పంపిణీ చేసినట్లు అధికారులు ప్రకటించారు.

మళ్లీ ఉద్రిక్తతలు

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యాన ఏజెన్సీ ప్రాంతంలో అక్కడక్కడా ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో పోడు కొట్టిన వారు, పోడు పట్టాలు రాని వారు మళ్లీ వ్యవసాయ పనులు ప్రారంభించడంతో అటవీ అధికారులు అడ్డుకుంటున్నారు. గత ఏడాది నవంబర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చలమల శ్రీనివాసరావుపై గొత్తికోయలు దాడి చేసి హతమార్చారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆక్రమణదారులపై తీవ్ర చర్యలు తీసుకుంది. కాగా ఈ సీజన్‌లో మళ్లీ పురుడుపోసుకుంటున్న ఆందోళనలు అగ్నికి ఆజ్యం పోసేలా కనిపిస్తున్నాయి. ఇటీవల కొణిజర్ల మండలం ఎల్లన్ననగర్‌లో పోడుదారులు, అటవీ సిబ్బందికి మధ్య ఘర్షణ జరిగింది. తాజాగా కారేపల్లి మండలంలోని అటవీ భూమిలో బోరు వేస్తున్నారనే సమాచారంతో వెళ్తున్న అటవీ సిబ్బందిని రెండు గ్రామాల సర్పంచ్‌లు నిర్బంధించి దాడి చేశారు.

కఠిన నిర్ణయాలకు సై

ఏజెన్సీలో పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేసిన అనంతరం కూడా మళ్లీ పోడు చేస్తే కఠినంగా వ్యవహరించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇక నుంచి అదనంగా పోడు కొట్టకుండా అటవీ భూమి సంరక్షణపై దృష్టి సారించింది. ఈ నేపథ్యాన అటవీ భూములను ఆక్రమించడం, ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు పేరుతో అలజడులు సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడడం లేదు. అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇప్పటికే కలెక్టర్ గౌతమ్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇకపై ఇంచు అటవీ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా చూసేలా ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చింది. అటవీ రక్షణకు సంబంధిత సర్పంచ్‌లను బాధ్యులుగా చేయగా... ఇప్పటికే పట్టాలు పొందిన వారు అదనంగా పోడుకు పాల్పడితే పట్టాలను రద్దు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది.

- కారేపల్లి మండలం మాణిక్యారం–చీమలపాడు రహదారిపై ఈనెల 5న రాత్రి అటవీ సిబ్బందిపై దాడి జరిగింది. కారేపల్లి రేంజ్ పాటివారిగుంపు బీట్‌లోని అటవీ భూమిలో బోర్లు వేస్తున్నారనే సమాచారంతో తాళ్లగూడెం సెక్షన్ అధికారి దేవర రమేష్, పాటివారిగుంపు బీట్ అధికారి ఎస్.రమేష్ సిబ్బందితో జీపులో వెళ్తుండగా చీమలపాడు, మాణిక్యారం సర్పంచ్‌లు మాలోతు కిషోర్, భూక్యా రంగారావు తదితరులు జీపును అడ్డుకుని తమపై దాడి చేశారని అటవీ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జిల్లాలో మళ్లీ పోడు రగడ మొదలవుతుందడానికి సంకేతాలిస్తోందని చెబుతున్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసిన కొణిజర్ల మండలం ఎల్లన్ననగర్‌లో పరిస్థితి యథాస్థితికి వచ్చింది. గత ఏడాది ప్రభుత్వ సూచనతో ఎల్లన్ననగర్‌లో సుమారు 231 మంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొత్తగా సాగు చేసిన 20 హెక్టార్ల భూమి తమకు అప్పగిస్తేనే మిగిలిన భూమి సర్వే చేసి పట్టాలు ఇస్తామని అటవీ అధికారులు చెప్పారు. దీనికి ఎల్లన్ననగర్ వాసులు ఒప్పుకోకపోవడంతో రాష్ట్రమంతా పోడు భూములకు పట్టాలు వచ్చినా ఇక్కడ మాత్రం సర్వే సాగలేదు. ఈక్రమంలో కొద్ది రోజుల క్రితం అటవీ అధికారులు అటవీ భూమి, పోడు భూమికి మధ్య ట్రెంచ్ కొట్టారు. ఈక్రమంలో పోడుసాగుదారులు అడ్డుకోగా... కొత్తగా పోడు కొట్టిన 20 హెక్టార్ల భూమిని అప్పగిస్తే వెంటనే సర్వే చేస్తామని అటవీ అధికారులు చేసిన ప్రతిపాదనను ఎల్లన్ననగర్ వాసులు తిరస్కరించడంతో సమస్య ఎటూ తేలలేదు.

ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు



అర్హులందరికీ పోడు పట్టాల పంపిణీ పూర్తయింది. ఇక నుంచి ఎవరైనా అటవీ భూమిని ఆక్రమించినా, చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై కలెక్టర్ గౌతమ్ సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలని సిఫారసు చేస్తాం. అలాగే, అటవీ అధికారులకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను కోరనున్నాం.

– సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

అనేక సమస్యలు పరిష్కరించా..





బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పువ్వాడ అజయ్, నాయకులు (ఇన్‌సెట్) గజమాలతో మంత్రిని సత్కరిస్తున్న నాయకులు

- వరద బాధితుల కోసం నా కోడలు రూ.50లక్షల సాయం చేసింది
- కల్లబొల్లి పార్టీల నాయకుల మాయమాటలు నమ్మొద్దు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ప్రజలు తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాక సీఎం కేసీఆర్ మంత్రివర్గంలోకి తీసుకోవడంతో ఈ నాలుగేళ్ల కాలంలో అనేక రుగ్మతలను పారదోలానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. తనకు దక్కిన మంత్రి అనే మంత్రదండంతో గోళ్లపాడు చానల్, లకారం చెరువు, ధంసలాపురం పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించానని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడంతో పాటు మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి కేబినెట్‌లో ఆమోదం వచ్చేలా కృషి చేసిన మంత్రి అజయ్‌ను ఆర్టీసీ ఉద్యోగులు, మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు సోమవారం సత్కరించారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ మున్నేరుకు వరద వచ్చినప్పుడల్లా బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతీనగర్ ప్రాంతాల్లోకి ఇళ్లల్లోకి నీరు చేరుతున్నా గత ప్రభుత్వాలు, నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. కానీ మున్నేరుపై తీగల వంతెన నిర్మించాలన్న ఆలోచన వచ్చిన రోజే వరద సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తాజా కేబినెట్ భేటీ సందర్భంగా గుర్తుచేయగానే సరైన నిర్ణయమంటూ మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి ఆమోదముద్ర వేయించారన్నారు. ఇతర ప్రత్యామ్నాయాలు ఉన్నా ప్రజలు ఇబ్బందులు పడతారని, ఆర్‌సీసీ వాల్ అయితే ఒక్క ఇల్లు, స్థలం పోకుండా సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. కాగా, మున్నేరు వరదల సమయాన అధికారుల మాటలు కొంత గందరగోళానికి గురిచేశాయని.. కానీ ఆర్‌సీసీ వాల్ నిర్మాణంతో ఎవరికీ నష్టం జరగదని మంత్రి భరోసా ఇచ్చారు.

వరద బాధితుల కోసం రూ.50లక్షల సాయం

ఇటీవల మున్నేటి వరదతో ప్రజలు నష్టపోగా, తన కోడలు అపర్ణ ఆమె తాత, నాన్నతో మాట్లాడి రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని కలెక్టర్ ఖాతాలో జమ చేసిందని మంత్రి పువ్వాడ తెలిపారు. అలాగే, అడగ్గానే ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రూ.కోటి విరాళం అందించారన్నారు. ఈ సాయాన్ని త్వరలోనే ముంపు బాధితులకు రూ.10వేలకు తగ్గకుండా స్థానిక కార్పొరేటర్ల ఆధ్వర్యాన పంపిణీ చేస్తామని తెలిపారు. కాగా, పేదల సంక్షేమాన్ని పట్టించుకునేది బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. అయితే, కల్లబొల్లి మాటలు చెబుతున్న పార్టీల నాయకులను నమ్మొద్దని సూచించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మూడోసారి సీఎంగా కాబోతున్నారని స్పష్టం చేశారు. ఖమ్మంలో మరికొన్ని పనులు చేయాల్సి ఉన్నందున తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వందల కోట్ల నిధులు ఇస్తున్నారన్నారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాల్సిన బాధ్యత తనపై ఉన్నందున... ఖమ్మంలో తన గెలుపు బాధ్యతను ఇక్కడి కార్యకర్తలు తీసుకోవాలని పువ్వాడ సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, బోజెడ్ల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాల్సిందే..



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ తదితరులు

కలెక్టర్ల వీసీలో సీఎస్ శాంతికుమారి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమవారం ఆమె హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు తదితర పథకాలపై వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకాల అమలులో వేగం పెంచాలని, నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు.

ఒకేరోజు 4.49లక్షల మొక్కలు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ జిల్లా అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. స్వాతంత్య్ర వజ్రోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు 4.49 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, ప్రతీవారం జిల్లాలో 100 గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ ఏయాలని, నియోజకవర్గానికి 300 చొప్పున బీసీలను ఎంపిక చేసి ఈ నెల 10లోగా ఆర్థికసాయం చెక్కుల పంపిణీ చేయాలని తెలిపారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణకు తహసీల్దార్, మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, ప్రతీ నియోజకవర్గానికి 1,100మంది లబ్ధిదారులకు దళిత బంధు పథకం అమలుచేయాల్సి ఉందని తెలిపారు. అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డి.మధుసూదన్ నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్, వివిధ శాఖల అధికారులు జ్యోతి, మహమూది, కృష్ణనాయక్, నవీన్‌బాబు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

మీ అధికారం సోనియా చలువే...

- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆటోడ్రైవర్లకు హెల్త్ కార్డుల పంపిణీ



ఆటోడ్రైవర్లకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రకటించారని.. తద్వారా బీఆర్‌ఎస్‌కు అధికారం దక్కిందని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పుడా పార్టీ నాయకులు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యాన ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం ఏర్పాటుచేశారు. తొలుత ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పించాక పొంగులేటి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ యూనియన్‌లో లేరనే నెపంతో తమ యూనియన్ ఆటోడ్రైవర్లను కొందరు వేధిస్తున్నారని ఆరోపించారు. వీటిని ఎదుర్కొనేందుకు లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి అధికార పార్టీ నేతల వేధింపులను న్యాయపరంగా ఎదుర్కొనేందుకు అయ్యే ప్రతీ రూపాయి పార్టీ తరపున తానే భరిస్తానని చెప్పారు. యూనియన్లతో సంబంధం లేకుండా ప్రతీ ఆటో డ్రైవర్‌కు పార్టీ తరపున ఇన్సూరెన్స్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కాగా, గత ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలను విస్మరించిన కేసీఆర్‌కు.... మళ్లీ ఎన్నికల వేళ ఆర్టీసీ ఉద్యోగులు, రైతులు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. అనంతరం ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేయడంతో పాటు బీఆర్‌ఎస్‌కేవీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సత్తార్ మియా తదితరులను ఐఎన్‌టీయూసీలోకి ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బేబి స్వర్ణకుమారి, మువ్వా విజయబాబు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మిక్కిలినేని నరేంద్ర, దొడ్డా నగేష్ యాదవ్, మలీదు జగన్, ఎం.డీ. ముస్తఫా, పల్లెబోయిన చంద్రయ్య, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, దుంపల రవికుమార్, ఇమాం, పమ్మి వెంకటేశ్వరరావు, నరాల నరేష్ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కూసుమంచి: బీఆర్‌ఎస్ హయాంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు మరో మూడు నెలలు ఓపిక పట్టాలని.. అప్పుడు అధికారంలోకి వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలోకష్టాలు తీరుతాయని పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన ముత్యాలగూడెంలో మాట్లాడుతూ పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు శ్రమించిన వారిపై ఇప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. కాగా, గ్రామానికి చెందిన సర్పంచ్ బొల్లికొండ శ్రీనివాసరావు ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా, ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి, మంకెన వాసు, వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ రహదారికి మోక్షం

- ఎట్టకేలకు వైరాలో దుకాణాల తొలగింపు
- వెడల్పుపై స్పష్టత ఇవ్వని అధికారులు



రహదారికి ఇరువైపులా దుకాణాలు తొలగిస్తున్న సిబ్బంది

వైరా: వైరా రోజురోజుకు అభివృద్ధి సాధిస్తున్నా... పర్యాటక కేంద్రమైన రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇటీవల 'సుడా' నిధులు రూ.కోటి మంజూరు కావడంతో రహదారి వెడల్పునకు అధికారులు రంగంలోకి దిగారు. ఈ నిధులతో వైరా రింగ్ రోడ్డు సెంటర్ నుండి రిజర్వాయర్ కాల్వ వరకు రోడ్డు వెడల్పు చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈమేరకు ఇరువైపులా చేపల అమ్మకందారులు, చిరు వ్యాపారులు నిర్మించుకున్న షెడ్లను సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన తొలగించే పనులు మొదలుపెట్టారు.

100 అడుగులా.. 60 అడుగులా?

రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి 100 అడుగుల మేర ఉండగా.. వ్యాపారస్తులు రోడ్డును సైతం అక్రమించుకున్నారు. తాజాగా సుడా నిధులు మంజూరు కావడంతో పర్యాటక కేంద్రానికి వెళ్లే రోడ్డుకు మహర్దశ పట్టినట్లేనని స్థానికులు భావించారు. కానీ రాజకీయ రంగు పులుముకోవడంతో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న 100 అడుగులకు బదులు 60 అడుగులు.. అవసరమైతే 30 అడుగులకే పరిమితం చేయాలనే యత్నాల్లో ఉన్నట్లు సమాచారం. పూర్తి స్థాయిలో పనులు మొదలైతేనే వివరాలు తెలిసే అవకాశముందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా రికార్డుల ప్రకారం 100 అడుగుల మేర రోడ్డును విస్తరించాల్సిందేనని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే వినతిపత్రాలు, దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా ఆమె అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీసీసీబీ సీఈఓ పోస్టుకు నోటిఫికేషన్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) పోస్టుకు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు(టస్కాబ్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత సీఈఓ వీరబాబు పదవీకాలం రానున్న అక్టోబర్‌తో మూడేళ్లు పూర్తవుతుంది. ఆలోగా మరొకరిని నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అనుభవం కలిగిన జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లతో పాటు ఉద్యోగ విరమణ చేసి అర్హులైన అధికారులు కూడా ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం ఇంటర్వ్యూ ఆధారంగా సీఈఓగా నియమిస్తారు.

ఆక్రమణలు, దాడులను సహించేది లేదు

సర్పంచ్ కిషోర్‌పై కేసు నమోదు

కారేపల్లి: అటవీశాఖాధికారులపై దాడులు, భూముల ఆక్రమణను సహించేది లేదని జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ స్పష్టం చేశారు. మాణిక్యారంలో అటవీ అధికారులపై దాడి జరిగిన నేపథ్యాన సోమవారం ఆయన కారేపల్లి ఫారెస్టు రేంజ్ కార్యాలయాన్ని సందర్శించి విలేకరులతో మాట్లాడారు. అధికారులపై దాడిచేసిన వ్యక్తులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదైనట్లు తెలిపారు. చీమలపాడు సర్పంచ్ మాలోత్ కిషోర్ ఆధ్వర్యాన జరిగిన దాడిని తీవ్రంగా పరిగణిస్తూ ఆయనపై అటవీ శాఖ నుండి పీఓఆర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆయనపై 2020 జనవరి 09న బీట్ ఆఫీసర్‌ను కొట్టిన కేసు కూడా ఉందని.. ఇది రెండో కేసు అని తెలిపారు. పోడు భూమికి పట్టాలు ఇచ్చే ప్రక్రియ పూర్తయిందని ప్రభుత్వం వెల్లడించిందని, ఇక నుంచి ఆక్రమణలను సహించేది లేదని చెప్పారు. ఎఫ్‌డీఓ బాబు మాట్లాడుతూ అటవీహక్కులు ఉన్న గిరిజనులు మాత్రమే పోడు భూమిలో బోరు వేసుకోవచ్చని, కానీ చీమలపాడు ప్రాంతంలో డబ్బు వసూలు చేసి బోర్లు వేయిస్తున్నట్లు తెలిసినందున విచారణ చేపట్టామని తెలిపారు. గతంలో తమ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలడంతో ముగ్గురిని సస్పెండ్ చేశామని చెప్పారు. ఎఫ్ఆర్ఓ సిద్ధార్థరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్ఓ కవితామాధురి తదితరులు పాల్గొన్నారు.

పే స్కేల్ కోసం వినతి


నవీన్‌మిట్టల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: రెవెన్యూ శాఖలో టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి పేస్కేల్ వర్తింపజేసేలా చూడాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. ఈసందర్భంగా సోమవారం హైదరాబాద్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు వినతిపత్రం అందజేశారు.

గద్దర్‌కు నివాళి

ప్రజా యుద్ధనౌక గద్దర్ పార్థివదేహాన్ని హైదరాబాద్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య సందర్శించి నివాళులర్పించారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష

ఖమ్మంలీగల్: వచ్చేనెల 9న లోక్ అదాలత్ జరగనుండగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సోమవారం కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

పరిహారం తీసుకున్నాక ఫిర్యాదు.. ఏడుగురిపై కేసు

కల్లూరు: పెద్ద మనుషుల సమక్షాన పంచాయితీ చేసి పరిహారం తీసుకోవడమే కాక మళ్లీ ఫిర్యాదు చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పడమర లోకవరానికి చెందిన గుగులోత్ కృష్ణకు తల్లాడ మండలం రామచంద్రాపురానికి చెందిన కృష్ణవేణితో 2019లో వివాహం జరిగింది. వీరిమధ్య మనస్పర్థలు రావడంతో పెద్ద మనుషుల సమక్షాన విడాకులు తీసుకోవడంతో కృష్ణవేణికి రూ.1.60 లక్షలు కృష్ణ పరిహారం చెల్లించారు. కానీ ఆమె మళ్లీ తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టడంతో కృష్ణ సత్తుపల్లి కోర్టును ఆశ్రయించాడు. దీంతో కృష్ణవేణితో పాటు ఆ కుటుంబానికి చెందిన ఏడుగురిపై కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

జ్ఞాపకం



జిల్లాలోని చింతకానిలో 2018లో జరిగిన కార్యక్రమానికి ప్రజా యుద్ధనౌక గద్దర్ హాజరై మాట్లాడారు. ఆయన ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. ఇదే కార్యక్రమంలో సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ కూడా పాల్గొనగా ఆయన సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. సదరు సమావేశంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మధు యాష్కీగౌడ్ తదితరులు పాల్గొనగా.. గద్దర్, జహీర్ అలీఖాన్ మృతి మృతిపై భట్టి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు!

- పోలీసు, అగ్నిమాపక శాఖల్లో ఎస్సైలుగా పలువురి ఎంపిక
- ఎంపిక పరీక్షల్లో సత్తా చాటిన జిల్లా యువత
- పలువురు బీటెక్ పూర్తిచేసిన వారే!



ప్రజలకు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటే వారికి సేవ చేసే అవకాశం పోలీసు శాఖ ద్వారా వస్తుందని నమ్మారు.. అనుకున్నదే తడవుగా రాత్రింబవళ్లు సిద్ధమైన పలువురు పరీక్షల్లో సత్తా చాటారు. తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా నుంచి పలువురు యువతీ, యువకులు ఎస్సైలుగా ఎంపికైనట్లు వెల్లడైంది. ఇందులో ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా ఉండడం విశేషం. అయినా పోలీసు ఉద్యోగంపై మక్కువతో కష్టపడి కొలువు సాధించి భేష్ అనిపించుకుంటున్నారు.

గ్రూప్స్‌కు సిద్ధమవుతూనే...


గుర్రాల వెంకట కృష్ణారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు గ్రామానికి చెందిన గుర్రాల వెంకట కృష్ణారెడ్డి(23) ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన బీటెక్ పూర్తిచేసి ప్రస్తుతం గ్రూప్–1కి సిద్ధమయ్యాడు. ఈక్రమంలో పోలీస్ శాఖ నిర్వహించిన ఎస్‌ఐ పరీక్షకు హాజరై 400మార్కులకు గాను 254 సాధించి ఎస్‌ఐగా ఉద్యోగం సాధించాడు. ఈమేరకు పట్టుదలతో ఎస్సైగా ఎంపికైన రైతు కుటుంబానికి చెందిన గుర్రాల సత్యనారాయణరెడ్డి–రాధ దంపతుల కుమారుడైన కృష్ణారెడ్డిని గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

రైతుబిడ్డ అఖిల


కొనకంచి అఖిల

రఘునాథపాలెం: ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా శ్రమించిన ఓ రైతు బిడ్డగా ఎస్సైగా నిరూపించింది. రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన కొనకంచి ప్రభాకర్‌రావు – సునీత దంపతుల ఏకైక సంతానం అఖిల సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది. రైతు కుటుంబంలో జన్మించిన ఆమె ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనే తపనతో ఇంజనీరింగ్ పూర్తిచేసి ఏడాది పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసినా సంతృప్తి చెందలేదు. ఆ ఉద్యోగం మానేసి శిక్షణ పొంది ఎస్సై పోస్ట్ దక్కించుకుంది. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసి క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే ఉద్యోగం సాధించింది. అయినా సంతృప్తి చెందగా తల్లిదండ్రులు, పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తున్న మేనమామ యడ్ల సతీష్ ప్రోత్సాహంతో ఎస్సై పరీక్షకు హాజరైంది. ఓపెన్ విభాగంలో సివిల్ ఎస్సైగా 263 మార్కులతో ఎంపికైన ఆమె... మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించడం విశేషం. కష్టంతో కాదు ఇష్టంతో చదివితే ఏ ఉద్యోగమైనా సాధించవచ్చని ఆమె చెబుతోంది. అయితే, ఎస్‌ఐగా ఎంపికైనా గ్రూప్స్ సిద్ధమవుతానని చెబుతున్న అఖిలను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

మండలంలో ముగ్గురికి కొలువు




విజయసింహారెడ్డి, వీరేష్, హేమంత్‌కుమార్

కూసుమంచి: ఎస్సై ఫలితాల్లో మండలానికి చెందిన ముగ్గురు యువకులు సత్తా చాటారు. వీరిలో ఇద్దరు సివిల్ విభాగంలో, మరొకరు ఫైర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. పాలేరు గ్రామానికి చెందిన ఎడవెల్లి విజయసింహారెడ్డి, నల్లమల వీరేష్ ఎస్సైగా ఎంపిక కాగా వీరిలో విజయసింహారెడ్డి సివిల్ ఎస్సైగా, వీరేష్ ఫైర్ ఆఫీసర్‌గా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అలాగే, ధర్మాతండాకు చెందిన వడ్త్యి హేమంత్‌కుమార్ సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. పాలేరుకు చెందిన ఎడవెల్లి విజయసింహారెడ్డి బీటెక్ పూర్తిచేయగా మొదటి ప్రయత్నంలోనే ఎస్సై కొలువు సాధించాడు. ధర్మాతండాకు చెందిన హేమంత్‌కుమార్ వైజాగ్‌లోని రక్షణ శాఖలో, వీరేష్ సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఎస్సైలుగా ఎంపిక కాగా.. మండల ప్రజలు అభినందించారు.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా...


కొర్రపాటి రవికిరణ్

మధిర: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని కృషి చేస్తే విజయం సొంతమవుతుందని చెబుతున్నారు ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైన మధిర వాసి కొర్రపాటి రవికిరణ్. మధిరకు చెందిన కె.సునీత – యోహాన్ ప్రభుఉత్వ ఉపాధ్యాయులు కాగా, వీరి చిన్న కుమారుడు రవికిరణ్ మొట్టమొదటి పోటీపరీక్షల్లోనే ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఆయన తల్లిదండ్రులతోపాటు బంధువుల్లో పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండడంతో తాను కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నాడు. దీంతో బీటెక్ అయ్యాక ఉద్యోగావకాశాలు వచ్చినా చేరలేదు. ఆయన స్నేహితుడు పోలీస్ ఉద్యోగానికి సిద్ధమవుతుండడంతో రవికిరణ్ కూడా 2020 నుంచి సాధన మొదలుపెట్టారు. తొలుత హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్‌లో చేరినా కోవిడ్ కారణంగా ఇంటికొచ్చి ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకున్నాడు. మళ్లీ పరిస్థితులు చక్కబడ్డాక హైదరాబాద్ వెళ్లి ఎస్సై పరీక్షకు సిద్ధమైన ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి సునీత, మేనమామ కిరణ్‌కుమార్ ప్రోత్సాహం.. బంధువులు, స్నేహితుల సహకారం మరువలేనిదని చెప్పారు.

కూలీ కుటుంబం నుంచి ఒకరు.. పట్టుదలతో ఇంకొకరు..



బదుగుల అంజమ్మ, పువ్వాళ్ల నరేష్

తల్లాడ: తల్లాడ మండలం నుంచి ఇద్దరు ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని ముద్దునూరుకు చెందిన నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించిన బదుగుల అంజమ్మ 225 మార్కులతో ఎస్సైగా ఎంపికైంది. అలాగే, మిట్టపల్లిలో మధ్య తరగతి కుటుంబానికి పువ్వాళ్ల నరేష్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చినా వెళ్లకుండా పట్టుదలతో చదివి ఎస్సైగా ఎంపికయ్యారు. బీటెక్ పూర్తిచేసిన ఆయన పోలీస్ శాఖకు ఎంపిక కావాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని తన కల సాకారం చేసుకున్నాడు. ఇక అంజమ్మ గతంలో రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా సాంకేతిక కారణాలతో వెళ్లలేదు. అయినా కుంగిపోకుండా క్రమశిక్షణగా చదివి ఎస్సై ఉద్యోగానికి ఎంపికై తల్లిదండ్రుల కలను సాకారం చేసింది. ఈ సందర్భంగా నరేష్, అంజమ్మను మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

కొండ్రుపాడు యువకుడు


శివరామకృష్ణ

పెనుబల్లి : పెనుబల్లి మండల పరిధిలోని కోండ్రుపాడుకు చెందిన మాచినేని శివరామకృష్ణ జనరల్ విభాగంలో సివిల్ ఎస్సై పోస్టుకు అర్హత సాధించాడు. జూన్ 4లో 261 మార్కులు స్కోర్ చేసినట్లు , దీంతో సివిల్ ఎస్సైకు అర్హత సాధించినట్లు శివరామకృష్ణ తెలిపారు. 1 తరగతి నుండి 10 తరగతి వరకు సత్తుపల్లిలో, ఇంటర్మీడియట్ విజయవాడ, బీటెక్ చెన్నైలో పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

పేదింటి బిడ్డ కరీం


షేక్ కరీం

బోనకల్: మండలంలోని రావినూతలకు చెందిన పేదింటి యువకుడు షేక్ కరీం ఎస్‌ఐ ఫలితాల్లో ప్రతిభ చాటి ఉద్యోగం సాధించాడు. బీసీఈ కేటగిరీలో మొదటి ప్రయత్నంలోనే ఆయన ఉద్యోగం సంపాదించడం విశేషం. నిరుపేద కుటుంబంలో జన్మించిన కరీం కష్టపడి ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

'దోస్త్' స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్లు


రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు దోస్త్ స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్లు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.400 ఫీజు చెల్లించి ఈనెల 14వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈనెల 18నుంచి 21వరకు సీటు పొందిన కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

సీపీని కలిసిన బెటాలియన్ కమాండెంట్


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వెంకటరాములు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌ను సోమవారం కలిశారు. ఇబ్రహీంపట్నంలోని 3వ బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను ఇటీవల గంగారం బదిలీ చేయగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట అడిషనల్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

క్రెడాయ్ అధ్యక్షుడిగా జయకిషోర్


జయకిషోర్

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే రెండేళ్ల కాలానికి గాను క్రెడాయ్ ఖమ్మం బ్రాంచ్ నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా బండి జయకిషోర్, కార్యదర్శిగా పెద్ది కేశవరావు, కోశాధికారిగా చెరుకుమల్లి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా వడ్లమూడి గోపాలరావు, నంబూరి ప్రసాద్, వేములపల్లి నగేష్, శ్రీరామినేని శ్రీనివాసరావు, యార్లగడ్డ రాఘవ, సహాయ కార్యదర్శులుగా కమతం కమల్, మల్లెల శ్రీనివాసరావు, కొదుమూరి ఉమేష్, మహేందర్ రెడ్డి, తుళ్లూరి నాగేశ్వరరావును ఎన్నుకున్నట్లు బాధ్యులు వెల్లడించారు.

అర్థవంతంగా సమావేశాలు.. పరిష్కారం

స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్


చైర్మన్ కమల్‌రాజ్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లా పరిషత్‌లో ప్రతీ సమావేశాన్ని అర్థవంతంగా నిర్వహించి ప్రజాసమస్యలను పరిష్కరించామని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయి ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామన్నారు. ఈ నాలుగేళ్లలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశామని చెప్పారు. ఈ సందర్భంగా కారేపల్లి, వైరా జెడ్పీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో డొంక రహదారుల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నందున గ్రావెల్ రహదారులు నిర్మించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఇటీవల మృతి చెందిన జెడ్పీ ఉద్యోగికి సంతాపసూచకంగా మౌనం పాటించారు. అలాగే, నాలుగేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న కమల్‌రాజ్‌ను సన్మానించారు. జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

మధిర: గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కేర్ టేకర్ బాధ్యతల నుంచి తొలగించి కేవలం బోధనకే పరిమితం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు కోరారు. మధిర మైనార్టీ గురుకుల పాఠశాలను సోమవారం యూనియన్ నాయకులు సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ గురుకులాల్లోని ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఉపాధ్యాయులకు వార్డెన్ డ్యూటీ కేటాయించడం సరికాదని, కేర్ టేకర్లుగా ఇతరులను నియమించి ఉపాధ్యాయులపై భారం తగ్గించాలన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్‌వీ.రవికుమార్, జి.కిరణ్‌కుమార్‌తో పాటు ఎస్.కే.మదార్, ఆర్.బ్రహ్మారెడ్డి, కొమ్ము శ్రీనివాసరావు, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పిల్లి నర్సింహారావు, మద్రి కృష్ణయ్య, లింగంపల్లి అప్పారావు, తెల్లమేకల శ్రీనివాసరావు, అయిలూరి బిక్షమారెడ్డి, టి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీస్ తొలగించారని ఆగ్రహం

విద్యుత్ ఉద్యోగులపై దాడి, ఫర్నీచర్ ధ్వంసం


ఉద్యోగులపై దాడి చేస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో ఉద్యోగులపై దాడి చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. రఘునాథపాలెం పోలీసులు వెల్లడించిన వివరాలు... పది రోజులు క్రితం మండలంలోని హర్యాతండాలో విద్యుత్ బిల్లులు చెల్లించని వారి సర్వీసులే అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వారి సర్వీసులను ఉద్యోగులు తొలగించారు. దీంతో తండాకు చెందిన బి.రాము, వి.శివలాల్ సోమవారం మంచుకొండ సబ్ స్టేషన్ వద్ద సెక్షన్ కార్యాలయానికి వచ్చిన వారు తమ ఇళ్లలో కరెంట్ లేకుండా చేశారంటూ మంచుకొండ లైన్ ఇన్‌స్పెక్టర్ బాబురావుపై దాడి చేశారు. అడ్డొచ్చిన సబ్ ఇంజనీరు యాకూబ్, జేఎల్ఎం దేవీలాల్‌పై సైతం దాడి చేయడమే కాక కార్యాలయంలోని కంప్యూటర్, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కాగా, ఏడీ సంజయ్‌కుమార్ తదితరులు పరిశీలించి ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.

విద్యుత్ చౌర్యం కేసులో రూ.1.44లక్షల జరిమానా

ఖమ్మం లీగల్: విద్యుత్ చౌర్యం కేసులో కొణిజర్ల మండలం ఉప్పలచలకకు చెందిన బాదావత్ కస్నాకు రూ.1,44,420 జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి తీర్పు చెప్పారు. సోమవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. బాదావత్ కస్నా తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుకుంటుండగా 2020 జనవరి 28న ఖమ్మం విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో గుర్తించి కేసు నమోదు చేశారు. ఈమేరకు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. విచారణ అనంతరం జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు, గాదె హరేందర్‌రెడ్డి వాదించగా.. ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ జూకూరి రాజశేఖర్, హోంగార్డ్ అయూబ్ సహకరించారు.

పది మంది వ్యాపారుల బైండోవర్

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి, కొర్లగూడెం, వీఎస్ తండా, కల్లూరులో పలు కిరాణం షాపులను ఎక్సైజ్‌శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈమేరకు వ్యాపారులు పది మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నాటు సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక విక్రయించొద్దని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎక్సైజ్ ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు, వెంకటేష్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, విల్సన్, కె.శ్రీనివాస్, నరసింహారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, మండలంలోని వీఎస్.తండాల్లో చేపట్టిన తనిఖీల్లో రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

పోలీసుల కళ్లు కప్పి ఇసుక తరలించే యత్నం

నేలకొండపల్లి: ఇసుక అక్రమంగా తరలిస్తున్న కొందరు పోలీసులను బెదిరించేందుకు యత్నించిన ఘటన కలకలం రేపింది. నేలకొండపల్లి, ముదిగొండ మండలాలకు ఏపీలోని పలు ప్రాంతాల నుంచి అక్రమ ఇసుక సరఫరా అవుతోంది. ఈనేపథ్యాన సోమవారం ముదిగొండ మండలం నుంచి ట్రాక్టర్ వస్తుండడంతో పోలీసులు స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆపకుండా అతి వేగంగా వెళ్లేందుకు యత్నించగా... పోలీసులు నిలువరించారు. దీంతో డ్రైవర్ పోలీసులతోనే దురుసుగా ప్రవర్తించాడు. ఎట్టకేలకు డ్రైవర్, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని ఆయనకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించి కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని రోడ్డు నంబర్–3లో బ్యాంకు పార్కింగ్ స్థలంలో నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ప్రైవేట్ ఉద్యోగి మహ్మద్ ఆదిల్ ఈనెల 3న ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి మధ్యాహ్నం చూసేసరికి కనిపించలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక సోమవారం చేసిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వలస కూలీకి పాముకాటు

మధిర: పళ్ల తోముకునేందుకు వేపపుల్ల విరుస్తుండగా వలస కూలీని పాము కాటేసింది. జీవనోపాధి కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పిదంబరంనాయక్ మధిర పరిధిలోని ఖాజీపురం సమీపాన ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం ఉదయం వేప చెట్టు వద్ద పుల్లలు విరుస్తుండగా పాము కాటేసింది. దీంతో అక్కడే ఉన్న నాగరాజు ఇచ్చిన సమాచారంతో మధిర రెస్క్యూ బృందం సభ్యురాలు నిస్సి హారిణి చేరుకుని పిదంబరంను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కల్లూరు రూరల్: మండలంలోని చంద్రుపట్ల దళిత కాలనీలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. కాలనీకి చెందిన పరిగడుపు కృష్ణ కుటుంబసభ్యులు సోమవారం ఉదయం కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా.. ఇంట్లోని దుస్తులు, సామగ్రి కాలిపోయాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోగా ఇల్లంతా కాలిపోయింది. ఈమేరకు ఆర్‌ఐ అన్వర్ పరిశీలించి పంచనామా నిర్వహించారు.

రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాంపై వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాంపై సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం రాల్యూర్‌కు చెందిన తవాసి(39) జిల్లాలోని కూసుమంచి బేకరీషాపులో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. గతంలో ఆయన ఎర్రుపాలెంలోని బేకరీ షాపులో కూడా పనిచేశాడు. కూసుమంచి నుండి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఎర్రుపాలెం వచ్చిన ఆయన అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా, తవాసీ మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుడు మునుగోటి నర్సింహారావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి..

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆనంద్‌విహార్ హోటల్ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి(30) మృతి చెందాడని సీఐ స్వామి తెలిపారు. ఈమేరకు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా హోటల్ ముందు కూర్చున్న వ్యక్తి పక్కకు ఒరిగిపోయి మృతి చెందినట్లు గుర్తించామని, ఆయన గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 87126 59107 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.